క్లుప్తంగా

డిగ్రీ ఫలితాలలో కృష్ణవేణి విద్యార్థుల ప్రతిభ



నరసరావుపేట ఈస్ట్: ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం ప్రకటించిన ద్వితీయ సంవత్సరం డిగ్రీ పరీక్షల మూడవ సెమిస్టర్ ఫలితాలలో కృష్ణవేణి డిగ్రీ కళాశాల విద్యార్థులు పల్నాడుజిల్లాలో ఉత్తమ ఫలితాలు సాధించినట్టు కళాశాల ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. తమ విద్యార్థులు బీఎస్సీ ఎంపీసీఎస్‌లో 750 మార్కులకుగాను ఆర్.శ్రీలక్ష్మి 742, షేక్ రేష్మా 711, షేక్ నజ్మా 707మార్కులు, ఎంఎస్‌సీఎస్‌లో పి.పావని 736, కె.వనజ, వై.వెంకట భార్గవి 695మార్కులు, ఎంపీసీలో ఎస్.వినిత 693, బి.హారిక 682, ఎంఈసీఎస్‌లో ఎస్.స్రవంతి 632, షేక్.అస్మ 616, బీజడ్‌సీలో 800 మార్కులకు గాను ఎల్.అంకిరెడ్డి 727, షేక్.పర్వీన్ 725, ఎంబీసీసీఎస్‌లో కె.మానస 713, ఎస్.జానకిలక్ష్మి 706, బీకాం కంప్యూటర్స్‌లో 700 మార్కులకుగాను ఎల్.రాకేష్‌నాయక్ 675, షేక్ జునేద్ అహ్మద్ 584 మార్కులు సాధించి పల్నాడు జిల్లాలోనే ఉత్తమ స్థానాల్లో నిలిచారని వివరించారు. విద్యార్థులను కళాశాల డైరెక్టర్ కె.నాసరయ్య, వైస్ ప్రిన్సిపాల్ ఎంఆర్‌కె సతీష్‌బాబు, ఎం.బాలకోటేశ్వరరావు అభినందించారు.

23న ఐదో తరగతి, ఇంటర్ ప్రవేశ పరీక్షలు

వినుకొండ(నూజెండ్ల): స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల (బాలికలు)లో 5వ తరగతి, జూనియర్ ఇంటర్ ప్రవేశపరీక్ష ఈ నెల 23వ తేదీన నిర్వహించడం జరుగుతుందని పాఠశాల ప్రిన్సిపాల్ బి.వెంకటమ్మ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఈ నెల 23వ తేదీ ఉదయం 10గంటల నుంచి 12 గంటల వరకు జరిగే పరీక్షకు హాజరుకావాలని సూచించారు. అదేవిధంగా జూనియర్ ఇంటర్ ప్రవేశపరీక్ష అదేరోజు మధ్యాహ్నం 2గంటల నుంచి 4.30గంటలకు జరుగుతుందని, తప్పనిసరిగా ప్రతిఒక్కరూ ఒక గంట ముందుగా పరీక్ష సెంటర్‌కు చేరుకోవాలని తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు


చిలకలూరిపేటటౌన్: వ్యక్తి అదృశ్యంపై రూరల్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గుంటూరుకు చెందిన వెన్నపూస శ్రావణ్‌కుమార్‌రెడ్డి బెంగళూరులో ఓ ప్రైవేటు కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తుంటాడు. ఈ నెల 14వ తేదీ గుంటూరుకు వచ్చి 16వ తేదీ మంగళవారం తిరుగు ప్రయాణంలో మండలంలోని పీఎస్–5 రెస్టారెంట్ వద్ద బస్సు దిగి తిరిగి బస్సు ఎక్కలేదు. దీంతో బస్సు యాజమాన్యం ఇచ్చిన సమాచారంతో అప్రమత్తమైన తండ్రి మల్లిఖార్జునరెడ్డి పలు ప్రాంతాల్లో గాలించి మంగళవారం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ విషయంపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతి



యడ్లపాడు: రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతిచెందిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రత్తిపాడు మండలం తుమ్మలపాలెం గ్రామానికి చెందిన తాడిబోయిన అనిల్‌కుమార్, సునీత దంపతులు ఇటీవల కాలంలో శాపాడు గ్రామంలోని పొలాన్ని విక్రయించారు. తిరిగి మరోచోట భూమిని కొనేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో సునీత బోయపాలెం ప్రసన్నాంజనేయస్వామి ఆలయ అర్చకుడు పరంకుశం రంగాచారిగణపతిని కలవగా ఇద్దరు చిలకలూరిపేట వెళ్లారు. తిరిగి రాత్రి 10 గంటల సమయలో గ్రామానికి వస్తుండగా వేగంలో ఉన్న బైక్ ప్రమాదవశాత్తు అదుపుతప్పి తిమ్మాపురం వద్ద డివైడర్‌ను ఢీకొంది. దీంతో వెనుక కూర్చుని ఉన్న సునీత తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న 108 వాహన సిబ్బంది గుంటూరు జీజీహెచ్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందింది. సునీత భర్త అనిల్‌కుమార్ ఫిర్యాదు మేరకు యడ్లపాడు ఎస్‌ఐ పైడి రాంబాబు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఎండుగుంపాలెం సర్పంచ్ మృతి



జి. నాగేశ్వరరావు(ఫైల్)

నాదెండ్ల: మండలంలోని ఎండుగుంపాలెం గ్రామ సర్పంచ్ గట్టినేని నాగేశ్వరరావు (55) మంగళవారం తెల్లవారుజామున మృతి చెందారు. ఇటీవల ఈయనకు గుండెపోటు రావటంతో గుంటూరు ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. ఆరోగ్యం విషమించటంతో మృతి చెందారు. 2021 ఫిబ్రవరిలో జరిగిన ఎన్నికల్లో సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. ఈయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కొన్నేళ్లుగా చిలకలూరిపేట పట్టణంలో నివశిస్తూ వంశీ డ్రైఫ్రూట్స్ వ్యాపారం నిర్వహిస్తున్నారు. ఈయన మృతిపై పలువురు నాయకులు సంతాపం తెలిపారు.

రాష్ట్ర ప్రజలందరి నమ్మకం జగనన్నే



ఐదో వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న కర్నాటి కృష్ణమూర్తి, గృహసారథులు, సచివాలయ ఇన్‌చార్జ్‌లు



తురిమెళ్లలో కరపత్రం అందజేస్తున్న జడ్పీటీసీ ఓబుల్ రెడ్డి, ఎంపీపీ గడ్డం వెంకట్రావు

- విస్తృతంగా 'జగనన్నే మా భవిష్యత్'
- పలు వార్డుల్లో నిర్వహించిన గృహసారథులు, సచివాలయ ఇన్‌చార్జిలు, స్థానిక నాయకులు

నరసరావుపేట: పట్టణంలోని పలు వార్డుల్లో మంగళవారం జగనన్నే మా భవిష్యత్..మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం కోలాహలంగా నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆదేశాల మేరకు ఆరోవార్డులోని నాలుగు, తొమ్మిది క్లస్టర్లలో గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో కలిసి స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు ఇంటింటికి తిరిగారు. గత టీడీపీ, ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వాలు అనుసరించిన విధానాలపై ఐదు ప్రశ్నలను సంధించి వారి నుంచి సమాధానాలను స్వీకరించారు. వారి అనుమతితో ఇళ్లకు స్టిక్కర్లు అంటించి వారిచే మిస్డ్ కాల్ చేయించారు. ముఖ్యఅతిథిగా పల్నాడు జిల్లా దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు కర్నాటి కృష్ణమూర్తి పాల్గొని ప్రతి గృహాన్ని సందర్శించి అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు. అలాగే 33వ వార్డులో కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు, సచివాలయం ఇన్‌చార్జి జి.అచ్యుతరావు, గుంటి ప్రశాంత్, 33వ వార్డు నాయకులు మర్రిపూడి రాంబాబు, వలంటీర్‌లు బందెల సంజయ్‌నాథ్, దర్శి కిషోర్, గృహసారథులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రొంపిచర్లలో...

రొంపిచర్ల: ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని జడ్పీటీసీ పిల్లి ఓబుల్‌రెడ్డి అన్నారు. మండలంలోని తురిమెళ్ల, చిట్టిబోతులవారిపాలెం గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన మా నమ్మకం నువ్వే జగనన్నా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇంటింటికి స్టిక్కర్‌లు అంటిస్తూ 82960 82960 నెంబరుకు మిస్డ్ కాల్ ఇప్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గడ్డం వెంకట్రావు, మార్కెట్ యార్డు చైర్మన్ పచ్చవ రవీంద్రబాబు, సచివాలయ కన్వీనర్‌ల మండల అధ్యక్షుడు గాదె రామిరెడ్డి, సర్పంచి గాజుల మాణిక్యం, శ్రీనివాసరావు, కాటం శ్రీనివాసరావు, ఏసుపోగు ఆనందరావు, బందెల సుబ్బారావు పాల్గొన్నారు.

ఉత్తీర్ణతశాతం పెరిగే విధంగా కృషి చేయాలి



చిరుమామిళ్లలో రామిరెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

నాదెండ్ల: వేసవి సెలవుల అనంతరం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల డ్రాపవుట్స్ లేకుండా ఉపాధ్యాయులు శ్రద్ధ వహించాలని విద్యా దాత, గోల్కొండ గ్రూపు సంస్థల చైర్మన్ నడికట్టు రామిరెడ్డి చెప్పారు. చిరుమామిళ్ల కాసు రాఘవమ్మ, బ్రహ్మానందరెడ్డి ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఐదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 20 నుంచి పరీక్షలు జరుగుతున్నందున ఉత్తీర్ణత శాతం గణనీయంగా పెరిగేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. ఎంఈఓ అంజనేయులు మాట్లాడుతూ, గత కొన్నేళ్ళుగా ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నడికట్టు రామిరెడ్డి సొంత నిధులతో విద్యార్థులకు పౌష్టికాహారం, అదనపు యూనిఫాం జత, నోటు పుస్తకాలు పంపిణీ చేయటం అభినందనీయమన్నారు. అనంతరం విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్లు బహూకరించారు. ఈ సందర్భంగా రామిరెడ్డిని ఉపాధ్యాయులు పూలమాలలు, శాలువాలతో సత్కరించారు.

ముమ్మరంగా రీసర్వే పనులు

ఆర్డీఓ ఎం.శేషిరెడ్డి

శావల్యాపురం: రీసర్వే పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని నరసరావుపేట డివిజన్ రెవెన్యూ అధికారి మర్రిడ్డి శేషిరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం సందర్శించారు. ఈసందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ నరసరావుపేట డివిజన్ పరిధిలో మొదట విడతలో రీ సర్వే పూర్తి చేసిన 70 రెవెన్యూ గ్రామాల్లోని రైతుల పొలాల్లో సరిహద్దు రాళ్ల ఏర్పాటు చేసే పనులు జరుగుతున్నాయన్నారు. వినుకొండ నియోజకవర్గం పరిధిలో జిల్లా కలెక్టర్ ఆదేశాలు మేరకు సంబంధింత రైతుల పొలాల్లో 10 వేల సరిహద్దు రాళ్ల వేయటానికి లక్ష్యంగా ఎంచుకొనగా, ఎండను సైతం లెక్కచేయకుండా రెవెన్యూ సిబ్బంది సాయంత్రం వరకు 4వేల రాళ్ల వేశారన్నారు. చెప్పారు. రీసర్వే పనులు వచ్చే నెల 20వ తేదీ నాటికి నూరుశాతం పూర్తయ్యేలా తహసీల్దార్లు, సర్వేయర్లు, వీఆర్‌ఓలకు ఆదేశాలు జారీ చేశామన్నారు. రెండవ విడతలో ఎంపికైన శావల్యాపురం మండలం కనమర్లపూడి రెవెన్యూ గ్రామంలో రీసర్వే పనులతో పాటు రికార్డు పనులు పూర్తి అయ్యాయని, త్వరలో రైతులకు భూహక్కు పత్రాలు అందజేయనున్నట్లు చెప్పారు. అనంతరం వినుకొండ పట్టణంలో ఎన్‌జీఓ భవనంలో జరుగుతున్న రీసర్వే రికార్డు పనులను ఆర్డీఓ పరిశీలించి రెవెన్యూ అధికారులకు సూచనలు చేశారు. ఆయనతో పాటు తహసీల్దార్ షేక్ జాన్‌సైదులు, డిప్యూటీ తహసీల్దార్లు వేముల వెంకట నాగరాజు, పి.నాసరయ్య, మండల డిప్యూటీ సర్వేయర్ తుంగా శ్రీనివాసరావు, వీఆర్‌ఓలు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేసే ప్రాంతాలు

చిలకలూరిపేట: విద్యుత్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో బుధవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏడీఈ ఆర్.అశోక్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని సీఆర్ కాలనీ, రజకకాలనీ, ఓల్డ్ బ్యారన్‌నగర్, ఏఎంజీ డొంక, ధనలక్ష్మి గెస్ట్ హౌస్ ప్రాంతాల్లో సంబంధిత వేళల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన



పెట్రోల్ బంక్ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

వినుకొండ టౌన్: వాహనాలకు పెట్రోల్, డీజిల్ నింపే సమయంలో, గ్యాస్ సిలిండర్ల లోడింగ్, అన్‌లోడింగ్ సమయంలో అగ్నిప్రమాదం సంభవించినప్పుడు, తీసుకోవలసిన జాగ్రత్తలపై మంగళవారం పట్టణంలోని రిలయన్స్ పెట్రోల్ బంక్ సిబ్బందితో పాటు భారత్ గ్యాస్ గూడెం సిబ్బందికి అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బంది అవగాహన కల్పించారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా గ్యాస్ సిలిండర్ లీకేజీ, విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వలన సంభవించే అగ్నిప్రమాదాలను అరికట్టే అంశాలను వివరించారు. ఐసీఎస్‌ఎఫ్ ఎం. శ్రీనివాసరావు, డీఓపీ రమణారెడ్డి, ఎల్‌ఎఫ్‌లు డి.ప్రకాష్‌రావు, ఎ.వెంకటేశ్వర్లు, ఎఫ్‌ఎంలు కేశవబాబు, ప్రభాకర్‌రెడ్డి, కోటేశ్వరరావు, మస్తాన్, మల్లిఖార్జునరావు, సిబ్బంది పాల్గొన్నారు.

నరసరావుపేటలో...

నరసరావుపేట ఈస్ట్: వేసవిలో పెట్రోల్ బంక్‌లు, గ్యాస్ గోడౌన్‌ల యాజమాన్యాలు, సిబ్బంది అప్రమత్తతతో తగిన జాగ్రత్తలు తీసుకొని అగ్ని ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఫైర్ ఆఫీసర్ ఎం.వి.సుబ్బారావు తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా మంగళవారం అగ్నిమాపకశాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని విజయ్ ఆయిల్ ఫిల్లింగ్ స్టేషన్, హెచ్.పి గ్యాస్ గోడౌన్‌లలో అగ్ని ప్రమాద నివారణ చర్యలపై సిబ్బందికి ప్రత్యక్ష ప్రదర్శనల ద్వారా అవగాహన కలిగించారు. లీడింగ్ ఫైర్‌మెన్‌లు మల్లె.శ్రీనివాసరావు, డి.సాంబయ్య, ఫైర్‌మెన్‌లు ఎం.పుష్పరాజ్, బి.బి.వి.సతీష్, వి.వి.ఎస్.ప్రసాదు, ఎస్.సాంబశివరావు, ఆపరేటర్లు పాల్గొన్నారు.

49.50 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



విజిలెన్స్ అధికారులకు పట్టుబడిన చౌకబియ్యం బస్తాలు

చిలకలూరిపేట: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం పట్టుకున్నారు. విజిలెన్స్ డీఎస్పీ సీహెచ్ శ్రీనివాసరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం బొప్పూడి అడ్డరోడ్డువద్ద వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా ఏపీ39టీసీ 1593 నంబరు గల లారీలో ఒక్కొక్కటి 50 కేజీలు ఉన్న 99 బస్తాల చౌకబియ్యం గుర్తించారు. ఇది 49.50 క్వింటాళ్లకు సమానం. వాహనడ్రైవర్ మెడబలిమి రాజేష్‌తో పాటు అక్రమ రవాణాకు పాల్పడుతున్న సుభాని, కిషోర్, ప్రతాప్, సాగర్ లపై చిలకలూరిపేట రూరల్ పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదు చేశారు. దీంతో పాటు నిత్యావసరాల చట్ట ప్రకారం 6ఏ కేసు నమోదు చేసి సదరు చౌకబియ్యాన్ని స్థానిక ఎంఎల్‌ఎస్ పాయింట్‌కు తరలించారు. కార్యక్రమంలో విజిలెన్స్ ఇన్స్‌పెక్టర్ టి.లక్ష్మారెడ్డి, తహసీల్దార్ కె.నాగమల్లేశ్వరరావు, ఎస్‌ఐ ఎం.రామచంద్రయ్య, వీఆర్‌ఓ జానకిరామయ్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న కేంద్రం

చిలకలూరిపేట: ప్రజా వ్యతిరేక విధానాలు అవలింభిస్తున్న కేంద్ర ప్రభుత్వంపై పోరాటానికి ప్రతి ఒక్కరు సన్నద్ధం కావాలని సీపీఐ, సీపీఎం నాయకులు కోరారు. వామపక్ష పార్టీల ప్రచారభేరి కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక కార్యక్రమాలపై మండలంలోని గ్రామాలలో మంగళవారం ప్రచారం నిర్వహించారు. కరపత్రాలు పంపిణీ చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాసంక్షేమాన్ని విస్మరించి ప్రభుత్వ రంగ పరిశ్రమలను, ఓడరేవులను, ఆఖరికి అందరికీ అన్నం పెట్టే వ్యవసాయరంగాన్ని సైతం కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ అండదండలతో పారిశ్రామికవేత్త అదానీ ఏ విధంగా మోసం చేసి లక్షల కోట్లు కొల్లగొట్టాడో హిడెన్‌బర్గ్ నివేదిక బట్టబయలు చేసిందని స్పష్టం చేశారు. ఆయా పార్టీల నాయకులు షేక్ సుభాని, పేలూరి రామారావు, పేరుబోయిన వెంకటేశ్వర్లు, విల్సన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆందోళనతో యూనియన్ బ్యాంక్ మూసివేత



మూతబడిన రెంటపాళ్ల యూనియన్ బ్యాంక్

సత్తెనపల్లి: బంగారం మాయంలో రుణగ్రహీతలకు ఇంకా బంగారం అందక పోవడంతో మహిళలు మంగళవారం సత్తెనపల్లి మండలం రెంటపాళ్ళ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఆందోళన చేపట్టారు. గత జనవరి 26న బ్యాంక్ మేనేజర్, గోల్డ్ అప్రైజర్ కలిసి బంగారం మాయం చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంలో పలువురిని పోలీసులు అరెస్ట్ చేశారు. మొత్తం 43 మంది రుణగ్రహీతలకు చెందిన 3149.42 గ్రాముల బంగారం మాయం కాగా దాని విలువ రూ.1.52 కోట్లుగా తేల్చారు. బంగారం మాయం కావడం పై రైతులు పలు విధాలుగా ఆందోళనలు చేపట్టారు. దీంతో బ్యాంక్ అధికారులు స్పందించి 43 మంది బంగారం రుణగ్రహిత లకు బంగారం స్థూల బరువుపై 9 శాతం మేకింగ్ చార్జీలు, మూడు శాతం జీఎస్టీ కలిపి పరిహారం చెల్లించ డానికి అంగీకరించి హామీ పత్రలను అందించారు. కాగా సోమవారం రుణగ్రహితలు బ్యాంక్ అధికారులను సంప్రదించగా మంగళవారానికి వాయిదా వేశారు. తిరిగి మంగళవారం రుణగ్రహితలు, మహిళలు బ్యాంకుకు వచ్చి గట్టిగా ప్రశ్నించారు. ఆ సమయంలో ఎలాంటి గొడవలు కాకుండా పోలీసులు బందో బస్తు నిర్వహించారు. దీంతో బ్యాంక్ అధికారులు ఉన్నతాధికారులను సంప్రదించగా ప్రస్తుతం బ్యాంక్ మూసి వేయమని చెప్పడంతో బ్యాంక్ సిబ్బంది బ్యాంక్‌కు తాళ్ళాలు వేసి వెళ్ళారు.

బార్ ఎన్నికల్లో పోటీలో ఉన్న అభ్యర్థులు వీరే

నరసరావుపేట: జిల్లా కేంద్రమైన నరసరావుపేట బార్ అసోసియేషన్‌కు 2023–24 ఏడాదికి సంబంధించి ఈనెల 21వ తేదీన నిర్వహిస్తున్న కార్యవర్గ ఎన్నికలలో నామినేషన్లు సక్రమంగా ఉన్న అభ్యర్థుల జాబితాను కమిటీ అధ్యక్షుడు ఎస్.అయ్యపరాజు ప్రకటించారు. మంగళవారం నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ పూర్తయిన వెంటనే పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితాను విడుదల చేశారు. బుధవారం ఫైనల్ జాబితాను ప్రకటించనున్నారు. నామినేషన్లు సక్రమంగా ఉన్న వారిలో అధ్యక్ష పదవిలో న్యాయవాదులు జి.జయప్రకాష్, మేదరమెట్ల నాగేశ్వరరావు, ఉపాధ్యక్ష పదవికి అమూల్య, మహమద్ నసీమా బేగం, కార్యదర్శి పదవికి ఎస్.ప్రసాదు, ఏ.ఏడుకొండలు పోటీలో ఉన్నారు. కాగా సంయుక్త కార్యదర్శి, కోశాధికారి పదవులకు న్యాయవాదులు వి.సాంబశివరావు, కె.సునీల్‌సింగ్ ఒక్కొక్కరే పోటీలో ఉండడంతో వారు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు.

వైభవంగా సత్తెమ్మతల్లి వార్షికోత్సవం

అచ్చంపేట: మండలంలోని కొండూరు శివారు శ్రీనివాసతండాలో వేంచేసియున్న సత్తెమ్మతల్లి 5వ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన ప్రత్యేక పూజల్లో స్థానిక ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. దుశ్శాలువాలతో ఎమ్మెల్యేని సత్కరించారు. పలు గ్రామాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి పొంగళ్లు పొంగించి మొక్కుబడులు సమర్పించుకున్నారు.

దేవాలయ భూముల కౌలు వేలం

అచ్చంపేట: మండలంలోని కోనూరులోగల దేవాలయ భూములను రెండు వ్యవసాయ సీజన్లకు కౌలుకు చేసుకునేందుకుగాను దేవదాయశాఖాధికారులు మంగళవారం బహిరంగ వేలం నిర్వహించారు. శ్రీసోమేశ్వర స్వామివారి దేవస్థానం కింద 9.06 ఎకరాల భూమి ఉండగా రూ. 5,05,000లకు, శ్రీ రఘునాయకస్వామివారి దేవస్థానం కింద ఉన్న 9.55 ఎకరాల భూమిని, రూ.2,61,000లకు పాట జరిగింది. రెండు వ్యవసాయ సీజన్లు అనగా 2023–24, 2024–25 సీజన్లు అమలులో ఉంటుందని దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ లీలావతి తెలిపారు. కార్యక్రమంలో ఎండోమెంట్ కార్యనిర్వహణాధికారి రామకోటిరెడ్డి, రైతులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మున్వర్ మసీదుకు రూ.2లక్షలు వితరణ

- మసీదును సందర్శించి అందజేసిన ఎమ్మెల్యే గోపిరెడ్డి
- ప్రత్యేక ప్రార్థనలు చేసి ఇఫ్తార్ స్వీకరణ



మసీదులో ఇఫ్తార్ ఫలహారాన్ని మైనార్టీ సోదరుడికి తినిపిస్తున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి

నరసరావుపేట: పట్టణంలో 21వవార్డు రామిరెడ్డిపేట పాత హెడ్ పోస్టాఫీసు సమీపంలోని మున్వర్ మసీదు అభివృద్ధికి ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి రూ.2లక్షల ఆర్థికసాయం అందజేశారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని కమిటీ ఆహ్వానం మేరకు మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మసీదును సందర్శించారు. ముస్లిం మతపెద్దలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోపిరెడ్డి మాట్లాడుతూ సర్వమతాల సారం ఒక్కటే అన్నారు. ఉపవాస దీక్షలు, ఆరాధన ప్రార్థనలు, మానవత్వం వంటి సద్గుణాలను పెంపొందించడమే రంజాన్ యొక్క ముఖ్య ఉద్దేశమన్నారు. రాబోయే రోజులలో హిందూ, ముస్లిం సోదరులు కలిసిమెలిసి జీవించి పల్నాడు జిల్లా అభివృద్ధి పథంలో ముందుకు వెళ్లేందుకు ప్రతిఒక్కరూ కృషిచేయాలన్నారు. ప్రతి ఒక్కరూ పవిత్ర రంజాన్ మాసంలో పవిత్రతను గుర్తించి అల్లా సూచించిన మార్గంలో నడవాలన్నారు. జిల్లాలోని మైనార్టీలకు రంజాన్ మాస శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో షేక్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఆషా బేగం ఖాజావలి, మార్కెట్‌యార్డు చైర్మన్ ఎస్.ఏ. హనీఫ్, జేకే కరిముల్లా, సయ్యద్ ఖాదర్‌బాషా, బాజి, మసీదు పెద్దలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పారిశ్రామికవేత్త దండా ప్రసాద్ సేవలు ఎనలేనివి

సంస్మరణ సభలో నివాళులర్పించిన ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు



గొరిజవోలులో దండా ప్రసాద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

నాదెండ్ల: నూలు పరిశ్రమ ప్రయోజనాలు కాపాడేందుకు పారిశ్రామికవేత్త దండా ప్రసాద్ చేసిన కృషి ఎనలేనిదని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు చెప్పారు. నాదెండ్ల మండలం, గొరిజవోలు గ్రామ పరిధిలోని జ్యోతిర్మయి టెక్స్‌టైల్స్‌లో మంగళవారం దండాప్రసాద్ ప్రథమ వర్ధంతి సభను నిర్వహించారు. అతిథులు దండాప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘననివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సంస్మరణ సభలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ మనం చేసే పనితో సమాజానికి మేలు జరగాలని ఆశించే ఉన్నత ఆశయాలు గల వ్యక్తి దండా ప్రసాద్ అన్నారు. ప్రభుత్వం నుంచి నూలు పరిశ్రమలకు రావలసిన రాయితీల విషయంలో తనతో అప్పటి పరిశ్రమలశాఖ మంత్రి దివంగత మేకపాటి గౌతంరెడ్డి దృష్టికి తీసుకొచ్చి సమస్యను పరిష్కరించటంలో ఆయన చూపిన చొరవ అభినందనీయమన్నారు. వినుకొండ శాసనసభ్యుడు బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ జ్యోతిర్మయి గ్రూపు సంస్థల స్థాపన ద్వారా వేలాది మందికి ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో ప్రసాద్ పనిచేశారని గుర్తు చేసుకున్నారు. ఏపీ స్పిన్నింగ్ మిల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు లంకా రఘురామిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం స్పిన్నింగ్ మిల్లు యాజమాన్యాల మధ్య సమన్వయకర్తగా వ్యవహరించి పరిశ్రమ ప్రయోజనాలకు విశేషంగా పనిచేశారన్నారు. తొలుత దండా ప్రసాద్ స్మృతి వనంలో ఆయన తండ్రి బ్రహ్మానందం, కుటుంబ సభ్యులతో కలిసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా కమ్మజన సేవా సమితి అధ్యక్షుడు సామినేని కోటేశ్వరరావు, భాష్యం విద్యా సంస్థల అధినేత రామకృష్ణ, మద్రాస్ ఫెర్టిలైజర్స్ డైరెక్టర్ నలబోలు వెంకటరావు, వీవీఐటీ విద్యాసంస్థల అధినేత వాసిరెడ్డి విద్యాసాగర్, తిరుమల ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ రావెల సత్యనారాయణ, పెరవల్లి నాగవంశీ, కడియాల వెంకటేశ్వరరావు, జవ్వాజి ఆంజనేయులు, కోయలమూడి రవీంద్ర, పాలడుగు పుల్లారావు, ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన పలువురు పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

మహిళల్లో ఆర్థిక చైతన్యం రావాలి



మాట్లాడుతున్న రేస్ సంస్థ డైరెక్టర్ నళిని

అమరావతి: మహిళలు తమ హక్కులను సాధించుకోవాలంటే ఆర్థికంగా చైతన్య వంతమవ్వాలని రేస్ స్వచ్ఛంద సేవాసంస్థ డైరెక్టర్ నళిని అన్నారు. మంగళవారం స్థానిక గుడ్‌షెపర్డ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో యుఫ్రేసియా కో ఆపరేటివ్ మహిళా సంఘం మహిళలకు నిర్వహించిన సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈసభకు సంస్థ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ లక్ష్మణ్ అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా నళిని మాట్లాడుతూ నానాటికి సమాజంలో స్త్రీలు ప్రతికూల పరిస్థితులను ఎదుర్కోవల్సి వస్తుందన్నారు. మహిళల్లో ఆర్థిక చైతన్యం, సమాజం పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలంటే విద్యకూడా చాలా ముఖ్యమన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలంటే చట్టాలతోపాటుగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను కూడా అందిపుచ్చుకోవాలన్నారు. గుడ్‌షెపర్డ్ సంస్థ సిస్టర్ విన్నరసి మాట్లాడుతూ మహిళలు గ్రామాల్లో ప్రజలకు అవసరమయ్యే చిరువ్యాపారాలను ఎంచుకుని క్రమశిక్షణతో వ్యాపారాలు లాభాలు గడించవచ్చునన్నారు. ఈ ఏడాది యుఫ్రేసియా కో ఆపరేటివ్ సొసైటీ ఇప్పటి వరకు రూ. 15 లక్షల రూపాయల రుణాలను ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో సిస్టర్ డియానా, మరియమ్మ, బ్యూలాపవన్‌తో పాటుగా మండల పరిధిలోని మహిళలు పాల్గొన్నారు.